సాక్షి రంగారెడ్డి

సోమవారం। 10 ఫిబ్రవరి। 2025



పల్లెల్లో పంచాయతీ సందడి

స్థానిక ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొంది. సత్తా చాటాలని ఆశావహులు కసరత్తు చేస్తున్నారు. 8లో▸



చేయూతనివ్వండి

కష్టాలు, ఆపదలో ఉన్నవారికి చేతనైతే సాయం చేయాలని కార్డినల్ పూల ఆంథోని సందేశం ఇచ్చారు. 8లో▸



మల్లన్నకు బోనాలు

షాబాద్ మండల పరిధిలోని వెంకమ్మగూడలో మల్లన్న బోనాలు, కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. 8లో▸

మళ్లీ ఫీ'జులుం'!

వార్షిక పరీక్షల వేళ.. విద్యార్థులపై ఒత్తిడి

- టెన్త్ సబ్జెక్ట్ బోధన పేరుతో తొమ్మిదో తరగతి విద్యార్థుల నుంచి వసూళ్లు
- ఫీజు చెల్లించని విద్యార్థులను బయటే నిలబెడుతున్న యాజమాన్యాలు
- విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఫీ'జులుం' మళ్లీ మొదలైంది. వార్షిక పరీక్షల గడువు సమీపిస్తుండటంతో పలు ప్రైవేటు యాజమాన్యాలు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. కార్పొరేట్ రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ కాలేజీ యాజమాన్యాలు దీపావళికి ముందే విద్యార్థుల నుంచి పూర్తి ఫీజులు వసూలు చేయగా, ఈ విషయంలో తామేమీ తక్కువ తిన్నమా అన్నట్లు ప్రైవేటు/కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా తొమ్మిదో తరగతి పూర్తి చేసుకుని, వచ్చే అకాడమిక్ ఇయర్‌లో పదో తరగతిలో అడుగుపెట్టబోయే విద్యార్థుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. తొమ్మిది, పదో తరగతిలో కామన్‌గా ఉండే పలు పాఠ్యాంశాలను ముందే (ఫిబ్రవరి 15 నుంచి) బోధించాల్సిందిగా విద్యాశాఖ సూచించింది. దీన్ని పలు ప్రైవేటు యాజమాన్యాలు 'క్యాష్' చేసుకుంటున్నాయి. ఫీజు చెల్లించిన వారికి పదో తరగతి పాఠ్యాంశాల బోధన పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ .. చెల్లించని వారిని వేరుగా చూపిస్తున్నాయి. తాజాగా హస్తినాపురం సిగ్నల్ సమీపంలోని ఓ ప్రముఖ పాఠశాల యాజమాన్యం ఇదే తరహాలో వ్యవహరిస్తున్నా.. జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బలవంతపు వసూళ్లు

జిల్లాలో 2,863 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా, వీటిలో 6.84 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 1.40 లక్షల మంది చదువుతుండగా, మిగిలిన విద్యార్థులంతా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలోనే విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఆయా యాజమాన్యాలు కనీస మౌలిక సదుపాయాలు, అనుభవం ఉన్న అధ్యాపకులు లేకపోయినా ఇష్టం వచ్చినట్లు ఫీజులు నిర్ణయించి, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. అదేమంటే ఇష్టం లేకపోతే టీసీ తీసుకుని వెళ్లిపోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నాయి. ఈ అంశంపై ఎవరైనా తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఏ ఒక్క యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. విధిలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు స్థానిక నేతలను ఆశ్రయిస్తుండటం విశేషం. తాజాగా లింగోజిగూడలోని ఓ కార్పొరేట్ స్కూల్ ఇదే తరహా వసూళ్లకు పాల్పడుతుండటంతో స్థానిక కార్పొరేటర్ తన అనుచరులతో కలిసి సదరు స్కూలు ఎదుట ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే.

అప్పుడే ఇంటర్ అడ్మిషన్లు షురూ

మార్చి 5 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ప్రాక్టికల్స్ నడుస్తున్నాయి. అకాడమిక్ ఇయర్ ఇంకా పూర్తి కాలేదు. కానీ కోహెడ, హయత్‌నగర్, ఆదిబట్ల, కొంగర, రావిర్యాల, కొండాపూర్ కేంద్రంగా వెలసిన పలు కార్పొరేట్ ఇంటర్మీడియట్ కాలేజీలు అప్పుడే ఫస్టియర్ కోర్సులకు అడ్మిషన్లు చేపడుతున్నాయి. ముందస్తుగా పేరు నమోదు చేసుకుని రూ.10 వేలు అడ్వాన్స్‌గా చెల్లించిన వారికి మొత్తం ఫీజులో కొంత రాయితీ కల్పిస్తున్నాయి. కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులకు టార్గెట్లు ఇచ్చాయి. ఒక్కో అధ్యాపకుడికి వందకుపైగా అడ్మిషన్లు లక్ష్యంగా ఇచ్చినట్లు తెలిసింది. అకాడమిక్ ఇయర్ ప్రారంభ సమయంలోనే 60 శాతం ఫీజులు తీసుకుంటున్నాయి. మిగిలిన మొత్తాన్ని దసరా, దీపావళిలోపే వసూలు చేస్తున్నాయి. చెల్లించడానికి నిరాకరించిన విద్యార్థులను లోనికి అనుమతించడం లేదు. విధిలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు అప్పు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. యాజమాన్యాలు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తిపడి కనీసం అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల వెలుగు చూస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలకు ఈ బలవంతపు ఫీజు వసూళ్లు కూడా ఓ కారణమని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

జిల్లా	ఫస్ట్ ఇయర్	సెకండ్ ఇయర్
రంగారెడ్డి	77,863	69,348
హైదరాబాద్	88,398	1,05,920
మేడ్చల్	64,107	62,316

మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

జిల్లా	విద్యార్థులు
రంగారెడ్డి	51,806
హైదరాబాద్	72,900
మేడ్చల్	47,257



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా బృందం

కోహెడలో హైడ్రా పంజా

అక్రమ కట్టడాల కూల్చివేత

తుర్కయంజాల్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఆదివారం పంజా విసిరింది. అక్కడి అనేక ప్రాంతాల్లో వెలిసిన అక్రమ కట్టడాలను అధికారులు కూల్చేశారు. సర్వే నంబర్ 951, 952ల్లోని గ్రామపంచాయతీ లేఔట్‌లో తమ ప్లాట్లను ఎస్.బాల్‌రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించారని, రహదారులు లేకుండా అడ్డుగోడలుగా కట్టారని రాధే ధామం లే ఔట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పలువురు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా అధికారులు పలు పత్రాలను పరిశీలించారు. 1986లో భూ యజమానులు కె.రాములు, పెద్దయ్య, ఈసయ్య గ్రామ పంచాయతీ లేఔట్ వేసినట్టు నిర్ధారించారు. బాల్‌రెడ్డి ఆ భూమిని స్వాధీనం చేసుకుని, ఫాంహౌస్ నిర్మించడంతో పాటు లే ఔట్‌లోని పలు ప్లాట్లను సొంతం చేసుకుంటూ అంతర్గత రహదారులను బ్లాక్ చేసినట్టు వెల్లడైంది. దీంతో అన్ని పత్రాలతో తమ కార్యాలయంలో హాజరు కావాలని ఇరుపక్షాలకు హైడ్రా నోటీసులు జారీ చేసింది. శనివారం వారు హాజరు కాగా రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలించింది. ఫామ్‌హౌస్, షెడ్, కాంపౌండ్ వాల్, ఫెన్సింగ్ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవంటూ తుర్కయంజాల్ మున్సిపల్ అధికారుల స్పష్టం చేశారు. ప్లాట్లను తమకు అమ్మిన తర్వాత బాల్‌రెడ్డి ఈ భూమిని తాను కొన్నట్టు రికార్డులు సృష్టించారని ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధుల ఆరోపించారు. హైడ్రా ఇరుపక్షాలతో పాటు రెవెన్యూ, మున్సిపల్ అధికారులను విచారించి బాల్‌రెడ్డి నిర్మించిన ఫాంహౌస్‌తో పాటు ప్రహరీ, ఫెన్సింగ్ కూల్చివేతకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఆదివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్రమ కట్టడాలను కూల్చేశారు.

న్యూస్‌రీల్

గురుమూర్తి తల్లి, సోదరి, సోదరుడిపై కేసు నమోదు

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మాజీ సైనిక ఉద్యోగి గురుమూర్తి తన భార్యను హత్య చేసిన కేసులో పోలీసులు అతడి తల్లి, సోదరి, తమ్ముడిపై కూడా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే గురుమూర్తి ఏ1గా ఉండగా, తాజాగా పోలీసులు ఏ2గా సోదరి ఎస్కల సుజాత, ఏ3గా తల్లి సుబ్బలక్ష్మమ్మ, ఏ4గా సోదరుడు పుట్టా కిరణ్‌ను చేర్చారు. హత్య కేసులో వీరి ముగ్గురికి ఎలాంటి ప్రమేయం లేదని.. అయితే కొంత కాలంగా మృతురాలు వెంకట మాధవిని అదనపు కట్నం విషయంలో భర్తతో పాటు వీరు ముగ్గురు మానసికంగా వేధింపులకు గురిచేశారని మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేధింపుల కింద కేసులు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య తదితరులు

కొందుర్గు: ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శించారు. పార్టీ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా కొందుర్గు మండలం మహదేవ్‌పూర్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిందని, కాంగ్రెస్ నాయకులు పథకాల అమలును దాట వేస్తున్నారని అన్నారు. పథకాల అమలును వెంటనే పూర్తి చేయాలని, లేదంటే సీపీఐ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య, సీనియర్ నాయకుడు టంగుటూరి నర్సింహారెడ్డి, మండల కార్యదర్శులు నర్సింహ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీరజ్ కుటుంబాన్ని పరామర్శించిన డీకే అరుణ



షాద్‌నగర్‌రూరల్: భారతీయ జనతాపార్టీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ కుమారుడు నీరజ్ ఇటీవల పాఠశాల భవనంపైనుండి పడి మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరువిష్ణువర్ధన్‌తో కలిసి ఆదివారం పట్టణంలోని సీఎస్కే వెంచర్‌లోగల హరిభూషణ్ ఇంటికి వెళ్లి నీరజ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి నీరజ్ మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం బాధాకరమని, ఈ ఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. నీరజ్ మరణం ఆ కుటుంబానికి తీరని లోటుఅని పేర్కొన్నారు.

నడకతో ఎముకల పటుత్వం



జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఖైరతాబాద్: దేహ దారుఢ్యం, ఎముకల పటుత్వం మెరుగుపర్చుకోవడానికి నడక ఉత్తమ మార్గమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం జలవిహార్ వేదికగా మూనోట్ హెల్త్‌కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థోపెడిక్ వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. పాదాలు, చీలమండలు, కీళ్ల పటుత్వం పెంచుకోవడంలో నడక దోహదపడుతుందన్నారు. ఎముకల ఆరోగ్యానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటే వృద్ధాప్యంలో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ.. ఎముకలు, కీళ్ల సమస్యలతో వృద్ధాప్యంలో బాధపడకుండా తీసుకునే జాగ్రత్తల గురించి ప్రతి పౌరుడూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



పండుగ సాయన్న, పూలే విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: యువత మహనీయుల జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మహాల్ ఎలికట్ట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావుపూలే, పండుగ సాయన్న విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహాత్మా జ్యోతిరావుపూలే, పేదల కష్టాలను తన కష్టాలుగా భావించి నిరుపేదలకు అండగా నిలిచిన పండుగ సాయన్నను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందె బాబాయ్య మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ముదిరాజ్ సంఘం నాయకుడు నీలం మధు మాట్లాడుతూ. ముదిరాజులు ఐక్యమత్యంతో ఏకతాటిపైకి వచ్చినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, నాయకులు మంగ వెంకటేశ్, అంచె రాములు, శ్రీధర్‌వర్మ, మల్లేష్ పూజారి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆమనగల్లు: రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యాటక ప్రాంత అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో శ్రీ వేదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఆదివారం జరిగిన కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి ఘనంగా ఆహ్వానం పలికారు. ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు. అనంతరం మంత్రి.. జూపల్లి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్, వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'మహా' ప్రణాళికకు మరో ఏడాది

2026 ఏప్రిల్ నాటికి మాస్టర్ ప్లాన్ సిద్ధం

- కన్సల్టెన్సీల ఎంపికకు హెచ్‌ఎండీఏ కసరత్తు
- మార్చిలో ఆసక్తుల వ్యక్తీకరణకు దరఖాస్తులు
- రీజినల్ రింగ్‌రోడ్డు వరకు బృహత్తర ప్రణాళిక



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ బృహత్తర ప్రణాళికను వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి సిద్ధం చేయాలని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) లక్ష్యంగా పెట్టుకొంది. రీజినల్ రింగ్‌రోడ్డు వరకు అర్బన్ తెలంగాణ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నట్లు ప్రభుత్వం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసి రీజినల్ రింగ్ రోడ్డు వరకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరిస్తూ మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నారు. ట్రిపుల్ ఆర్ తర్వాత ఉన్న ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా పరిగణిస్తారు. ఇందుకనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు హెచ్‌ఎండీఏ ఇప్పటికే కసరత్తు చేపట్టింది. ప్రజారవాణా వ్యవస్థలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల విస్తరణపై కామన్ మొబిలిటీ ప్రోగ్రామ్ (సీఎంపీ) అధ్యయనం చేపట్టారు. లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అధ్యయనం ఇప్పటికే ప్రాథమిక నివేదికను వెల్లడించింది. ఈ నివేదిక ప్రాతిపదికనే మెట్రో రెండో దశ విస్తరణకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ డీపీఆర్‌ను రూపొందించింది. తుది నివేదికను మరో రెండు నెలల్లో అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కన్సల్టెన్సీల ఎంపిక

బృహత్తర ప్రణాళికను రూపొందించేందుకు త్వరలో కన్సల్టెన్సీలను ఎంపిక చేయనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు. వచ్చే మార్చి నెలలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆసక్తుల వ్యక్తీకరణ దరఖాస్తులను (రిక్వెస్ట్ ప్రపోజల్స్)ను స్వీకరించేందుకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఎంసీహెచ్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, సైబరాబాద్, ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీలుగా 5 మాస్టర్‌ప్లాన్‌లు ఉన్నాయి. వీటన్నింటినీ ఒకే మాస్టర్ ప్లాన్‌గా రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నివాస సముదాయాలు, రహదారులు, ప్రజా రవాణా సదుపాయాలు, నీటి వనరులు అంశాల ప్రాతిపదికన హైదరాబాద్ మహానగర విస్తరణకు అనుగుణంగా ఈ ప్రణాళిక ఉండనుంది. హెచ్‌ఎండీఏ పరిధి ఇప్పుడున్న 7,450 చదరపు కిలోమీటర్ల నుంచి సుమారు 14,000 చదరపు కిలోమీటర్ల వరకు పెరగనున్నట్లు అంచనా. రీజినల్ రింగ్ రోడ్డు వెలుపల 5 కిలోమీటర్ల వరకు అమలయ్యేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నారు. ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించి ఇచ్చేందుకు అన్ని విధాలుగా సాంకేతిక సామర్థ్యం ఉన్న సంస్థలను ఎంపిక చేయనున్నారు. 'మార్చి నెలలో దరఖాస్తులను స్వీకరించి ఒకటి, రెండు నెలల్లో కన్సల్టెన్సీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం' అని హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు చెప్పారు.

గందరగోళానికి తావు లేకుండా..

ఇప్పుడున్న అయిదు మాస్టర్‌ప్లాన్‌లతో నిర్మాణ రంగంలో గందరగోళం నెలకొంది. ఒక మాస్టర్ ప్లాన్ ఇళ్ల నిర్మాణానికి అనుమతిస్తే మరో మాస్టర్ ప్లాన్‌లో అది రోడ్డు లేదా చెరువు లేదా మరో విధంగా నిర్ధారిస్తోంది. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌ను ప్రామాణికంగా పరిగణిస్తున్నప్పటికీ సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలకు అది సరైన పరిష్కారం చూపించడం లేదు. దీంతో గూగుల్ మ్యాప్‌లు, ఇతర ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. మరోవైపు చెరువులు, కుంటలు తదితర జలవనరుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను శాస్త్రీయంగా అంచనా వేయకపోవడంతోనూ చిక్కులు ఎదురవుతున్నాయి. వీటన్నింటికీ పరిష్కారంగా రాబోయే 20 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నారు. దీని కోసం సుమారు రూ.50 కోట్లకు పైగా ఖర్చు కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

అభాగ్యులకు చేయూతనివ్వండి



ఉత్సవాలకు హాజరైన భక్తులు

కార్డినల్ పూల ఆంథోని

- బాలఏసు పుణ్యక్షేత్రం వార్షికోత్సవాల్లో సందేశం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

తుర్కయంజాల్: చిన్న పిల్లలు దేవుడితో సమానమని, బాలఏసు భక్తులు చిన్న పిల్లల మనస్తత్వాన్ని కలిగి ఉండాలని కార్డినల్ పూల ఆంథోని సందేశం ఇచ్చారు. తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని అద్భుత బాలఏసు పుణ్యక్షేత్రం వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉరు పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయవద్దని, వారి జీవితాలను త్యాగం చేసి మనల్ని ప్రయోజకులు చేశారని గుర్తుచేశారు. కష్టాలు, ఆపదలో ఉన్నవారికి చేతనైతే సహాయం చేయాలని, లేదంటే వారి క్షేమం కోరి దేవుడికి ప్రార్థన చేయాలని సూచించారు. ఇటీవల విద్య, ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లిన అనేక మంది దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, అలాంటి వారికి ధైర్యాన్ని ప్రసాదించాలని బాలఏసును కోరాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం తెల్లవారుజామున 4 గంటల నుంచి దివ్య బలిపూజలు ప్రారంభమయ్యాయి. విచారణ గురువు, యంజాల ఫా.తాతిరెడ్డి, సహ గురువు ఫా.మాదాసు ఆరోగ్యస్వామి, ఫా.విక్టర్ ఇమ్మాన్యుయేల్, సాగినాల ప్రకాష్, రెక్స్ ఏంజెలోలో తెలుగు, తమిళం, ఇంగ్లిష్ భాషల్లో దివ్య బలిపూజ నిర్వహించారు. ఉదయం 6 గంటలకు నగరంలోని బోయిగూడలో ప్రారంభమైన బాలఏసు తేరు ప్రదక్షిణ కమ్మగూడకు 10:30 గంటలకు చేరుకుంది. భక్తులు తేరుకు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మాజీ కౌన్సిలర్ సునీల్ తదితరులు పాల్గొని బాలఏసు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు.

పార్కు స్థలంపై ఇరువర్గాల ఘర్షణ

మీర్‌పేట: పార్కు స్థలం విషయమై జరిగిన గొడవలో మీర్‌పేట పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. జిల్లెలగూడ శక్తినగర్ కాలనీలోని 350 గజాల పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం యజమానిని అడ్డుకున్నారు. దీంతో కాలనీ ప్రతినిధులు, యజమాని అనుచరుల మధ్య తోపులాట జరిగి గొడవకు దారితీసింది. ఈ మేరకు ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఔటర్‌పై కార్లతో విన్యాసాలు

శంషాబాద్ రూరల్: ఔటర్ రింగ్ రోడ్డుపై అర్ధ రాత్రి కార్లతో విన్యాసాలు చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. తొండుపల్లి ఔటర్ ఎగ్జిట్ 16, పెద్ద గోల్కొండ ఔటర్ ఎగ్జిట్ 15 మధ్యలో ఔటర్‌పై శనివారం అర్ధ రాత్రి రెండు కార్లతో గుర్తు తెలియని వ్యక్తులు విన్యాసాలు చేస్తున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బందికి సమాచారం రాకవడంతో అక్కడకు చేరుకునేలోపు కార్లతో పారిపోయారు. కార్లతో విన్యాసాలు చేసిన వారి గురించి పోలీసులు గాలిస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓఆర్ఆర్ సమీపంలోని గాంధీనగర్ వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉందని 100 నంబర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో రాజేంద్రనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి వయస్సు 40–45 సంవత్సరాలు ఉంటుందని..స్థానికంగా భిక్షాటన చేస్తూ రోడ్డు పక్కన ఉండేదని స్థానికులు తెలిపారు. అనారోగ్యంతో మృతిచెందిందని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పల్లెల్లో పంచాయతీ సందడి

పంచాయతీ, పరిషత్ ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొంది. స్థానిక సమరంలో ఎలాగైనా సత్తా చాటాలని ఆశావహులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. మరో కొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుంది. కానీ రిజర్వేషన్లు తేలకపోవడంతో కాస్త ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ.. అవి ఎలా వచ్చినా వాటికి అనుగుణంగా ముందుకు సాగే యత్నాలు చేస్తున్నారు.



ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం

వేడెక్కుతున్న రాజకీయం

- గెలుపు ధీమాల్లో అధికార పార్టీ
- పట్టు సాధించేందుకు కారు కసరత్తు
- మోదీ నామంతో కమల నాథులు



ఇబ్రహీంపట్నం: స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 15వ తేదీ లోపు వెలువడుతుందన్న ప్రకటనతో పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. ఆశావహులంతా పల్లెబాట పడుతున్నారు. బడా నేతలు తమ ఉనికి చాటుకునేందుకు యత్నిస్తున్నారు. 2024 జనవరి 31తో సర్పంచి, 2024 జులై 4తో ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిన సంగతి తెలిసిందే. నాటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే పార్లమెంటు ఎన్నికల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని అందరూ భావించారు. కానీ అధికార పార్టీ కాంగ్రెస్ ఎటూ తేల్చక కాలయాపన చేస్తూ వచ్చింది. అయితే ఇటీవల చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన వివరాలను ప్రభుత్వం వెల్లడించింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేయడం, ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తుండటం, ఎన్నికలకు వెళ్తున్నట్లు ప్రభుత్వం నుంచి సానుకూల సంకేతాలు రావడంతో రాజకీయ పార్టీలు.. ఎన్నికల కసరత్తుకు సమయాత్తం అవుతున్నాయి.

పై‘చేయి’ మనదే

అధికారంలో ఉన్నాం.. అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. కాబట్టి స్థానిక ఎన్నికల్లో తమదే పైచేయి ఉంటుందన్న ఆశతో కాంగ్రెస్ పార్టీ ఉంది. కానీ.. ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేయడంలో వెనుకబడివుంది. గ్రామ, మండల స్థాయిలో ఎలాంటి సమావేశాలను నిర్వహించిన దాఖలాలు లేవు. కార్యకర్తలను, నేతలను ప్రోత్సహించే కార్యక్రమాలు ఇప్పటి వరకు చేపట్టలేదు. అధికార కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొనడం తప్ప.. ఎన్నికల పోరుపై పూర్తి స్థాయి ఫోకస్ పెట్టలేదు.

కారు పార్టీ ప్రయత్నాలు

పల్లెల్లో పట్టు నిలుపుకొనేందుకు బీఆర్ఎస్ తీవ్ర కసరత్తు చేస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గులాబీ శ్రేణులతో సమాయత్తం అవుతున్నారు. విస్తృతస్థాయి సమీక్షలు నిర్వహించి, కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలో లేమన్న భావనను కార్యకర్తల్లో నుంచి తొలగించి, స్థానిక ఎన్నికల్లో కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దేందుకు ముమ్మర యత్నాలు చేయడంలో బీఆర్ఎస్ ముందంజలో ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వచ్చిన తీవ్ర వ్యతిరేకతే.. బీఆర్ఎస్‌కు కలిసి వస్తుందన్న ధీమాల్లో ఆ పార్టీ శ్రేణులున్నారు.

సంక్షేమ కార్యక్రమాలే రక్షగా.. బీజేపీ

స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ ఇంకా స్తబ్దుగానే ఉంది. ఎలాంటి కార్యాచరణ ప్రణాళిక చేపట్టలేదు. ఆ పార్టీకి ముందు నుంచి ఉన్న భావజాలంతో పాటు ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలే తమకు రక్షగా ఉంటాయని కమలనాథులు భావిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారిగానే ఓట్లను దండుకుంది. ఆ పట్టును ఈ స్థానిక సమరంలో నిలుపుకొంటుందా లేదా అనేది వేచి చూడాల్సిందే!

కమ్యూనిస్టులు ఉద్యమాలకే పరిమితం

కమ్యూనిస్టు పార్టీలైన సీపీఐ, సీపీఎంలు ప్రజా సమస్యలపై పోరాటాలకే పరిమితమయ్యాయి. ప్రజల్లో ఆ పార్టీకి పట్టు చిక్కడంలేదు. స్థానిక ఎన్నికల్లో పట్టు సాధిస్తుందనే నమ్మకం లేకపోయినా.. అభ్యర్థుల గెలుపోటములను కొన్నిచోట్ల శాసించే అవకాశం లేకపోలేదు.

ఓటర్లు 31,662

ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 14 గ్రామ పంచాయతీలు, 10 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. తాజా ఓటర్ల జాబితా ప్రకారం 31,662 మంది ఉన్నారు. అందులో పురుషులు 15,719 మంది, మహిళలు 15,941 మంది, ఇతరులు ఇద్దరున్నారు.

రిజర్వేషన్ల తర్జనభర్జన

రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల కారణంగా రిజర్వేషన్ల మార్పు అనివార్యం అయింది. తాజాగా కులగణన సర్వే పూర్తి కావడంతో రిజర్వేషన్లు మారుతాయన్న తర్జనభర్జన జోరుగా సాగుతోంది. ఆయా గ్రామాల ఎస్సీ,ఎస్టీ, బీసీల జనాభాను బట్టి రిజర్వేషన్లపై నేతలు అంచనాలు వేసుకుంటున్నారు.

సేకరించిన భూములు రైతులకివ్వాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

యాచారం: దేశంలో 2027లోనే జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, ఆ లోపే రేవంత్‌రెడ్డి సర్కార్ కూలిపోయే పరిస్థితి ఉందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఆదివారం యాచారం మండల బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్‌ను ఓడించి కాంగ్రెస్‌ను ఎందుకు తెచ్చుకున్నామని ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేసి సేకరించిన భూములను రైతులకు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఫార్మాసిటీకి వ్యతిరేకంగా, టీజీఐఐసీ మీదున్న పట్టా భూముల రికార్డులను తమ పేర్లపై మార్చాలని చేసే రైతుల ఆందోళనలకు మద్దతు ప్రకటిస్తామన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ హయాంలోనే అన్ని అభివృద్ధి పనులు చేశామన్నారు. మండలంలో మైనింగ్ జోన్ ఏర్పాటుకు కాంగ్రెస్ సర్కార్‌లోని పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో ప్రజలకు అందుబాటులో ఉండని ఎమ్మెల్యేను ఎందుకు గెలిపించామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. నియోజకవర్గానికి నిధులు తీసుకురావడంలో స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు గెలిచే విధంగా పార్టీ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌గౌడ్, భాషా, నాయకులు పరికిషన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజునాయక్, శంకర్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్త మృతి.. బంధువులకు చెప్పని భార్య

సైదాబాద్: భర్త మృతి చెందిన విషయం బంధువులకు ఎవరికీ చెప్పకుండా భార్య దహన సంస్కారాలకు స్వగ్రామానికి తీసుకెళ్లింది. ఆరోగ్యంగా ఉన్న సోదరుడు హఠాత్తుగా మరణించడం, మరదలు తమకి చెప్పక పోవటంతో సోదరుడి మరణంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి సోదరి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి... జనగాం జిల్లా దేవరుప్పల గ్రామానికి చెందిన కాసాని నారాయణ (42) నగరానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ సైదాబాద్ భానునగర్‌లో భార్య, పిల్లలతో కలిసి ఉంటున్నాడు. అయితే శుక్రవారం మధ్యాహ్నం నారాయణ చనిపోయాడని నిజామాబాద్ జిల్లా భానాపురంలోని అతని సోదరి బుచ్చమ్మకు బంధువుల నుండి సమాచారం అందింది. వెంటనే ఆమె హైదరాబాద్‌లోనే నివసించే వారి మరో సోదరి లక్ష్మికి ఫోన్ చేయగా ముందు రోజు కూడా నారాయణ ఆరోగ్యంగానే ఉన్నాడని, అతని మృతి విషయం తమకు కూడా ఎవరూ సమాచారం ఇవ్వలేదని చెప్పింది. మృతుడు నారాయణ భార్య అతని తరపు బంధువులు ఎవరికీ చెప్పకుండానే దహన సంస్కారాల కోసం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించినట్లు బుచ్చమ్మ తెలుసుకుంది. దాంతో సోదరుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మల్లన్నకు బోనాలు



శివసత్తులు, పోతురాజుల విన్యాసాలు

షాబాద్: ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని.. పాడి పంటలు సమృద్ధిగా పండాలని.. మండల పరిధిలోని వెంకమ్మగూడలో ఆదివారం మల్లన్న బోనాలు, కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు దేవాలయం వద్ద బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు సునీత, పాండు, మాజీ సర్పంచ్ శకుంతల, మాజీ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌లో అగ్ని ప్రమాదం



చెలరేగుతున్న మంటలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల డంపింగ్ యార్డ్ (డీఆర్‌సీ సెంటర్)లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు యార్డ్‌లోని చెత్తకు నిప్పు అంటించడంతో మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. గమనించిన మున్సిపల్ సిబ్బంది ఉన్నత అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి మంటలను ఆర్పించారు. డంపింగ్ యార్డ్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి.

అక్కా అంటూ పరిచయం చేసుకుని...

ఆమె కూతురిపై లైంగికదాడి

బంజారాహిల్స్: అక్కా అంటూ పిలుస్తూ ఓ కుటుంబంతో పరిచయం పెంచుకున్న యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఆమె కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మోతీనగర్‌లో నివసించే బత్తుల శివ (33) కారు డ్రైవర్‌గా జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ డైరెక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. అదే కంపెనీ బిల్డింగ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మహిళను పరిచయం చేసుకుని అక్కా అంటూ తరచూ ఇంటికి వెళ్తూ ఆమె భర్తతో కలిసి మద్యం తాగేవాడు. శనివారం రాత్రి బాధిత యువతి తండ్రి తీర్థయాత్రలకు వెళ్లగా, తల్లి అదే బిల్డింగ్ మొదటి అంతస్తులో పని కోసం వెళ్లింది. బాధితురాలి సోదరుడు కూడా అదే బిల్డింగ్‌కు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా మొదటి అంతస్తులో ఉన్నాడు. రాత్రి 8 గంటల సమయంలో బాధిత యువతి ఇంట్లో ఉండగా బత్తుల శివ వచ్చాడు. రాత్రి 11.30 గంటల వరకు ఇద్దరు మాట్లాడుకున్నాక..ఇక తాను వెళ్తానని శివ చెప్పగా యువతి బెడ్‌పై నిద్రకు ఉపక్రమించింది. అరగంట తర్వాత ఆమె మేల్కొనగా..శివ కదలికలు కనిపించడంతో ఒక్కసారిగా అరవాలని ప్రయత్నించింది. దిండుతో ఆమె నోరు నొక్కేసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని, నువ్వు ప్రేమించిన యువకుడితో పెళ్లి చేస్తానని నమ్మించాడు. అర్ధరాత్రి ఒంటి గంటకు ఇంట్లో నుంచి వెళ్లిపోగా జరిగిన ఘటనపై బాధిత యువతి తీవ్రంగా రోదిస్తూ తల్లికి విషయం చెప్పింది. ఈ మేరకు పోలీసులు బత్తుల శివపై బీఎన్ఎస్ సెక్షన్ 64 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్ లిఫ్ట్ గుంతలో పడి వాచ్‌మెన్ మృతి

నాగోలు: అపార్ట్‌మెంట్ లిఫ్ట్ గుంతలో పడి వాచ్‌మెన్ మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సికింద్రాబాద్ వారాసిగూడ చెందిన ఎస్.శ్రీనివాస్ (50) చింతలకుంట సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వివేరా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం డ్యూటీకి వచ్చిన శ్రీనివాస్‌కు లిఫ్ట్ లాక్ ఓపెన్ చేయాలని అపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ చెప్పాడు. దీంతో శ్రీనివాస్ లిఫ్ట్ ఓపెన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు లిఫ్ట్ డోర్ ఓపెన్ అయి నాలుగో ఫ్లోర్ నుంచి కింద ఉన్న గుంతలో పడి మృతి చెందాడు. కానీ ఈ విషయాన్ని అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న వారు, సెక్యూరిటీ సిబ్బంది సైతం బయటకు వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. ఏమీ తెలియనట్లుగా శ్రీనివాస్ కనిపించడం లేదని ఎల్‌బీనగర్ పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లిన పోలీసులు అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా శ్రీనివాస్ లిఫ్ట్ గుంతలో పడిపోయినట్లు గుర్తించి..బయటకు తీశారు. అతను అప్పటికే మృతి చెందాడు. దీంతో శనివారం రాత్రి ఎల్‌బీనగర్ పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. అపార్ట్‌మెంట్ నిర్వాహకులు శ్రీనివాస్ లిఫ్ట్ గుంతలో పడిన విషయం తమకు తెల్పలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఓఆర్ఆర్ సమీపంలోని గాంధీనగర్ వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతిచెంది ఉందని 100 నంబర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో రాజేంద్రనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి వయస్సు 40–45 సంవత్సరాలు ఉంటుందని..స్థానికంగా భిక్షాటన చేస్తూ రోడ్డు పక్కన ఉండేదని స్థానికులు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయాడని బంధువుల ఆందోళన



సత్యం (ఫైల్)



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

తుర్కయంజాల్/ఇబ్రహీంపట్నం రూరల్: కడుపు నొప్పి వచ్చిందని ఆస్పత్రికి వెళ్తే.. ప్రాణాలే తీశారని బాధితులు ఆరోపించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ శ్రీరామ్‌నగర్‌కు చెందిన జి.సత్యంగౌడ్ కడుపు నొప్పితో బాధపడుతూ శనివారం ఉదయం యంజాల్ ఆస్పత్రికి వెళ్లాడు. సత్యంను పరిశీలించిన డ్యూటీ డాక్టర్ పెద్ద సమస్య లేదని, రెండు గంటల్లో రికవరీ అవుతాడని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆదివారం ఉదయం డాక్టర్ ప్రశాంత్.. రోగి పరిస్థితి సీరియస్‌గా ఉందని తొలుత చెప్పారు. అనంతరం 8.45 గంటలకు సత్యంగౌడ్(46) మృతి చెందినట్లుగా నిర్ధారించారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన

ఆస్పత్రి యాజమాన్యం, వైద్యుల నిర్లక్ష్యంతోనే సత్యంగౌడ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. వీరికి సీపీఎం మున్సిపాలిటీ కార్యదర్శి కిషన్, సీపీఐ నాయకులు యాదయ్యలు మద్దతుగా నిలిచారు. అనుభవం లేని వైద్యుల వైద్యంతోనే సత్యం చనిపోయాడని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట పోలీసులను మోహరించారు. పరిహారం ఇచ్చే వరకు మృతదేహాన్ని తీసేది లేదని కుటుంబీకులు పట్టుబడ్డగా.. సీఐ వ్యవహారాన్ని సద్దుమణిగించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌పై దాడి

బీజేపీ నేత కుమారుడి సహా మరొకరి అరెస్టు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కొట్లాడుకుంటున్న యువకులను వారించి..ఇంత అర్ధరాత్రి ఏం చేస్తున్నారు..ఇళ్లకు వెళ్లిపోండి అంటూ హితవు పలికిన టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌ను తీవ్రంగా కొట్టి గాయపర్చిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే..నార్త్‌జోన్ ట్రాఫిక్ కానిస్టేబుల్ టి.ఈశ్వర్‌రావు శనివారం రాత్రి 12.30 గంటల ప్రాంతంలో విధి నిర్వహణలో భాగంగా ఓ కేసు విషయమై యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ సి-బ్లాక్ నుంచి వెళ్తున్నాడు. అదే సమయంలో ఓ ఇంటి అరుగుపై ముగ్గురు యువకులు మద్యం సేవిస్తూ తమలో తామే గొడవ పడుతూ కొట్టుకుంటున్నారు. రాత్రి 12 గంటల సమయంలో వీధుల్లో తాగుతూ ఈ ఘర్షణలు ఏమిటని ఈశ్వర్‌రావు వారిని నిలదీసి ఇళ్లకు వెళ్లిపోవాలని చెప్పాడు. అందులో ఒకరు ఇంటికి వెళ్లిపోగా, మిగతా ఇద్దరు కృష్ణానగర్‌కే చెందిన బీజేపీ నేత కొడుకు కుంభాల సాయితేజ (30), జంగం చెల్లారావు (35) కానిస్టేబుల్ వెళ్తుండగా అడ్డుకుని ముఖంపై పిడిగుద్దులతో బాదారు. వారి నుంచి తప్పించుకునేందుకు కానిస్టేబుల్ ప్రయత్నించగా కిందకు నెట్టేసి తొక్కారు. ముక్కు నుంచి నోటి నుంచి రక్తం కారుతుండగా కానిస్టేబుల్ వారి నుంచి తప్పించుకునేందుకు యత్నించగా మరోసారి అడ్డుకుని కిందకు తోస్తూ ఆయన సెల్‌ఫోన్ లాక్కొన్నారు. సుమారు 20 నిమిషాల పాటు బీభత్సం సృష్టించారు. కానిస్టేబుల్ డయల్ 100కు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చేలోగానే నిందితులిద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు. బాధిత కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కుంభాల సాయితేజ, జంగం చెల్లారావులపై బీఎన్ఎస్ 126 (2), 115 (2), 292, రెడ్‌విత్ 3 (5) సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.